



ప్రధాన పైపులైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మేయర్ బివై రామయ్య

సర్టిఫికెట్ల కోసం ఎదురు చూపులు

- ఆగిన సర్టిఫికెట్ల ముద్రణ
- ముద్రణ ప్రారంభించని ఎంపికైన ఏజెన్సీ
- వేలాది మంది బిఇడి అభ్యర్థులు దరఖాస్తు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ వర్సిటీలో డిగ్రీ, పీజీ, బీఈడీ, ఎల్ఎల్‌బి తదితర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు కాన్వకేషన్ సర్టిఫికెట్లు అందడం లేదు. జులై మొదటి వారం నుండి వర్సిటీలో సర్టిఫికెట్ల ముద్రణ ఆగిపోయింది. గతంలో పని చేస్తున్న ఏజెన్సీ టెండర్ గడువు ముగియడంతో కొత్త ఏజెన్సీ ఎంపికైనప్పటికీ పనులు ప్రారంభించలేదు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులు మాత్రం సర్టిఫికెట్ల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది.



రాయలసీమ వర్సిటీలో కాన్వకేషన్ పట్టాల కోసం వేలాది మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం వర్సిటీ పరిధిలో కాన్వకేషన్, మార్కుల జాబితాల ముద్రణ నిలిచిపోయింది. ఇప్పటివరకు ముద్రణ చేపడుతున్న ఏజెన్సీ గడువు ముగియడంతో వర్సిటీ ఉన్నతాధికారులు టెండర్‌కు ఆహ్వానించారు. సర్టిఫికెట్ల ముద్రణకు సంబంధించిన టెండర్‌ను విజయవాడకు చెందిన ఓ ఏజెన్సీ కైవసం చేసుకుంది. జులై నుండి కొత్త ఏజెన్సీ ద్వారా సర్టిఫికెట్ల ముద్రణ ప్రక్రియను చేపట్టాల్సి ఉంది. ఎంపికైన ఏజెన్సీ ఇప్పటి వరకు వర్సిటీ వైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది. మరో వారం రోజుల్లోనే డీఎస్సీ ఫలితాలు విడుదల కానున్నాయి. డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా కౌన్సిలింగ్ సమయంలో సర్టిఫికెట్లను సమర్పించాల్సి ఉంటుంది. అనేక మంది బీఈడీ కోర్సు పూర్తి చేసి డీఎస్సీ పరీక్ష రాసిన అభ్యర్థులకు కాన్వకేషన్ దరఖాస్తు చేసుకున్న వారిలో వేలాది మంది ఉన్నారు. వర్సిటీ పరిధిలో ఎల్ఎల్‌బి, డిగ్రీ మూడేళ్ల కోర్సు పూర్తి చేసిన అభ్యర్థులు కూడా పీజీ ఎల్ఎల్ఎం కోర్సు అభ్యసించేందుకు కాన్వకేషన్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వర్సిటీ ఉన్నతాధికారులు మాత్రం త్వరగా ఇస్తామని సమాధానం చెబుతూ తప్పించుకుంటున్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా త్వరగా కాన్వకేషన్ సర్టిఫికెట్లను అందజేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రధాన పైపులైన్‌కు మరమ్మతులు పూర్తి

- యథావిధిగా అదే వేళల్లో తాగునీటి సరఫరా
- ఆలస్యమయ్యే ప్రాంతాలకు ట్యాంకర్లతో సరఫరా : కమిషనర్
- మరమ్మతు పనులను పరిశీలించిన మేయర్ బివై రామయ్య

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరానికి తాగునీరు అందించే వ్యవస్థలో ప్రధాన పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీలకు మరమ్మతు పనులను శుక్రవారం మధ్యాహ్నం విజయవంతంగా పూర్తి చేసినట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మునగాలపాడు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నుండి అశోక్ నగర్ పంప్‌హౌస్‌కు ముడినీరు అందించే 1200 ఎంఎం ప్రధాన పైప్‌లైన్ లీకేజీల కారణంగా గత మూడు రోజులుగా నగర వ్యాప్తంగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడిందన్నారు. దాదాపు రెండున్నర దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన గ్రావిటీ పైప్‌లైన్ కోసం సుమారు 60 మందితో జాతీయ రహదారిపై దాదాపు 130 అడుగుల వెడల్పులో, 20 అడుగుల లోతులో లీకేజీల కోసం తవ్వినట్లు చెప్పారు. గత మంగళవారం నుండి ప్రారంభమైన పనులు, లీకేజీలను గుర్తించేందుకు నగరపాలక సిబ్బంది, హైదరాబాద్‌కు చెందిన అనుభవజ్ఞులైన నిపుణుల సహాయంతో రాత్రింబవళ్లు నిర్విరామంగా శ్రమించారని కొనియాడారు. రెండు రోజుల్లో పనులు పూర్తి అవుతాయని తొలుత భావించగా, అనుహ్యంగా 5 లీకేజీలు బయట పడటం కారణంగా వాటిని మరమ్మతులు చేయడానికి అనేక ఆటంకాలు ఏర్పడటంతో కొంత ఆలస్యంగా శుక్రవారం మధ్యాహ్నానికి పనులు పూర్తి చేశామన్నారు. శుక్రవారం సాయంత్రం నుండి యథావిధిగా తాగునీటిని సరఫరా చేస్తున్నామని పేర్కొన్నారు. మునుపటి వేళల్లోనే ప్రజలకు తాగునీటి సరఫరా చేస్తున్నామని, సరఫరా ఆలస్యమవుతున్న ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నామని తెలిపారు. దీని కోసం నగరపాలక కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూం కూడా ఏర్పాటు చేశామన్నారు. గత మూడు రోజులుగా సంయమనం పాటించి, నగరపాలక సంస్థకు సహకరించిన ప్రతి పౌరుడుకి, ప్రజాప్రతినిధులకు, జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అవసరమైన చర్యలు చేపట్టిన జాతీయ రహదారుల అధికారులకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే రాత్రింబవళ్లు శ్రమించి పనులను విజయవంతంగా చేయడానికి కృషి చేసిన ఇంజనీరింగ్ విభాగ అధికారులకు, సిబ్బందికి అభినందనలు తెలిపారు. కాగా సంతోష్ నగర్ వద్ద పూర్తైన మరమ్మతు పనులను మేయర్ బివై. రామయ్య పరిశీలించారు. నగరపాలక కంట్రోల్ రూంను అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పరిశీలించారు.

ఆరాధన మహోత్సవాలకు ప్రముఖులకు ఆహ్వానం

- కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేత

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్/మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని శ్రీ రాఘవేంద్రస్వామి మఠంలో ఆగస్ట్ 8 నుండి 14 వరకు జరుగనున్న రాఘవేంద్రుని 354వ ఆరాధన మహోత్సవాలకు హాజరు కావాలని పలువురు ప్రముఖులకు శ్రీ మఠం అధికారులు ఆహ్వాన పత్రికలను అందజేశారు. శుక్రవారం కర్నూలులోని జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌తో పాటు ఇతర జిల్లా స్థాయి అధికారులను శ్రీ మఠం ఎఎఓ మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు, సూపరింటెండెంట్ పురాణిక అనంతాచార్‌లు కలిసి శ్రీ మఠం నుండి శేష వస్త్రం, పరిమళ ప్రసాదం, ఆరాధన మహోత్సవాల ఆహ్వాన పత్రికలను అందజేసి ఆహ్వానించారు. అలాగే కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో ఆ రాష్ట్ర హోం శాఖ మంత్రి పరమేష్‌కు శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్ ఐపి నరసింహ మూర్తి ఆరాధన మహోత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఆహ్వాన పత్రిక అందజేశారు.



కలెక్టర్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న దృశ్యం

మహిళలు, పిల్లల భద్రతకు పటిష్ట చర్యలు

- సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలి : ఎస్పి

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

జిల్లా వ్యాప్తంగా మహిళలు, చిన్న పిల్లల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని, ప్రతి ఒక్కరూ సైబర్ నేరాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. శుక్రవారం కర్నూలు పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఆడిటోరియంలో మహిళలు, చిన్న పిల్లల పై జరిగే నేరాలను అరికట్టేందుకు మహిళా సంక్షేమం, భద్రత, మహిళా సాధికారత తదితర అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ హాజరై మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన శక్తి యాప్, శక్తి వాట్సాప్ సేవలు, శక్తి టీంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఇంటర్నెట్, మొబైల్ డేటా వచ్చాక మహిళలు, యువతులు, పిల్లలను టార్గెట్‌గా చేసుకొని నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. మహిళా భద్రతకు పటిష్టమైన చట్టాలు, శక్తి టీం, శక్తి యాప్ లాంటివి ఉన్నాయని, వీటిపై అందరూ అవగాహన పెంచుకోవాలని తెలిపారు. 24/7 శక్తి వాట్సాప్ నంబర్ అందుబాటులో ఉంటుందన్నారు. శక్తి వాట్సాప్ 7993485111, డయల్ 100, 112, కర్నూలు శక్తి వాట్సాప్ 7777877700, చైల్డ్ మ్యారెజెస్ 1098, సైబర్ క్రైమ్ 1930లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం తమ ఫోన్‌లలో ఈ నంబర్లను సేవ్ చేసుకోవాలన్నారు. ఎవరైనా ఈవ్ టీజింగ్ పాల్పడితే ఆకతాయిలకు కౌన్సిలింగ్ తో పాటు కేసులు నమోదు చేస్తామని చెప్పారు. కర్నూలు డిఎస్‌పి జె.బాబు ప్రసాద్ మాట్లాడుతూ ఎక్కువగా చదువుకున్న విద్యార్థినులు, మహిళలు ట్రాప్ అవుతున్నారన్నారు. మహిళా పిఎస్ డిఎస్పీ శ్రీనివాసాచారి మాట్లాడుతూ సోషల్ మీడియా పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చదువుకు, ఉజ్వల భవిష్యత్తుకు మాత్రమే సోషల్ మీడియాను వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థినులు అడిగిన సందేహాలను ఎస్పీ నివృత్తి చేశారు. కార్యక్రమంలో పుల్లారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల డీన్ దేవకి దేవి, సిఐలు అబ్దుల్ గౌస్, శ్రీధర్, విజయలక్ష్మీ, ఎస్సైలు, శక్తి టీం, పోలీసు సిబ్బంది, కళాశాల విద్యార్థినులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాఎస్పి విక్రాంత్ పాటిల్

ఆర్‌టిసి స్థలాలు ప్రయివేటుకు అప్పగించరాదు

- షాపింగ్ మాల్స్‌కు ఇచ్చే ప్రతిపాదనలను విరమించుకోవాలి
- 28న కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో నిరసన ప్రదర్శన
- సిఐటియు, ఎస్‌డబ్ల్యుఎస్ నేతలు

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

రాష్ట్రంలో విలువైన ఆర్టీసీ స్థలాలను ప్రభుత్వం ప్రైవేట్ సంస్థలకు అప్పగించే ప్రయత్నం తక్షణమే విరమించుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు, ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర కోశాధికారి జె.దివాకర్, జిల్లా కార్యదర్శి వివిఎస్. రాయుడు డిమాండ్ చేశారు. విజయవాడ గవర్నర్ పేట 2 డిపో, విజయవాడ పాత బస్టాండ్ స్థలాలను బహుళ జాతి సంస్థల షాపింగ్ మాల్‌కు ఇచ్చే ప్రతిపాదనలను తక్షణం విరమించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో నిరసన ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. శుక్రవారం కర్నూలు నగరంలోని కార్మిక కర్షక భవన్‌లోని సిఐటియు కార్యాలయంలో నిరసన కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాలను నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాల అమలులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో కూడా ప్రైవేటీకరణ ప్రక్రియను పూర్తి చేసి ఇప్పుడు ప్రయాణికుల అవసరాలను విస్మరించి ఎంతో విలువైన భూములను ప్రైవేట్ వ్యక్తులకు కట్టబెట్టే చర్యలను స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ వ్యతిరేకిస్తుందన్నారు. భవిష్యత్తు ప్రజా రవాణా అవసరాలకు ఉపయోగపడే ఆర్టీసీ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా కాపాడాల్సిన ప్రభుత్వమే కంచే చేను మేసినట్లు ఇలాంటి చర్యలకు పూనుకోవడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాలని కోరారు. ప్రైవేట్ వ్యక్తుల ప్రయోజనం కోసం ఆర్టీసీ గవర్నర్ పేట 2 డిపోను, విజయవాడ పాత బస్టాండ్‌ను మరొక చోటికి తరలించాలని నిర్ణయించడం ప్రజల ప్రయాణికుల ఆకాంక్షలకు విరుద్ధమన్నారు. ప్రభుత్వ రంగాన్ని ధ్వంసం చేసి ఆస్తులను బరితెగించి తెగనమ్మడానికి పూనుకోవడాన్ని ప్రజలందరూ అడ్డుకోవాలని కోరారు. గవర్నర్ పేట 2 డిపో, విజయవాడ పాత బస్టాండ్ స్థలాలను ఏడు సంవత్సరాల కిందట సుందరీకరణ పేరుతో నగర శివారు ప్రాంతాలకు తరలించాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను ఎస్‌డబ్ల్యుఎఫ్ ఇతర సంఘాలతో ఉమ్మడిగా కలిసి అడ్డుకుందని చెప్పారు. విద్యాధరపురంలోని ఆర్టిసి 5 ఎకరాల స్థలంలో ఇండో అమెరికన్ ఆసుపత్రికి కట్టపెట్టాలని రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను ప్రతిఘటించి నిలువరించిందన్నారు. ఇప్పటికే గన్నవరం విమానాశ్రయానికి ఎదురుగా ఉన్న 36 ఎకరాల ఆర్టీసీ శిక్షణ కళాశాల భూమిని, భవనాలను హెచ్‌సీఎల్ కంపెనీకి దారాధత్తం చేసిందన్నారు. నేడు ఆర్టీసీని నిర్వీర్యం చేయడంలో భాగంగా 400 కోట్ల విలువైన విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న గవర్నర్ పేట 2 డిపో, పాత బస్టాండ్ స్థలాన్ని బహుళ జాతి సంస్థ 'లులు'కు కట్టబెట్టి నగర శివారులోని గొల్లపూడికి తరలించడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. తిరుపతి, ఆటోనగర్ బస్ స్టేషన్ల నిర్మాణం ప్రవేట్ కార్పొరేటర్లతో కలిసి నిర్మించాలని ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. ఆర్టీసీ రూట్లో విదేశీ కంపెనీల విద్యుత్ బస్సులను అనుమతించిన కారణంగా ఆర్టిసి బస్సుల ఆక్యుపెన్సి రేషియో పడిపోతుందన్నారు. విద్యుత్ బస్సుల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు ఆర్టీసీ డిపోలను ఇచ్చే పథకం పట్ల ఆర్టీసీ ఉద్యోగులు, కార్మికులు తీవ్ర ఆందోళనతో ఉన్నారని చెప్పారు. ఆర్టీసీ సంస్థనే నేరుగా విద్యుత్ బస్సులను కొనుగోలు, ఆపరేషన్, మెయింటెనెన్స్ చేసే విధంగా అనుమతి ఇచ్చి ప్రజా రవాణాను బలోపేతం చేయాలని, ప్రజా రవాణాను ప్రైవేట్ వ్యక్తుల చేతికి ఇచ్చే చర్యలకు ప్రభుత్వం స్వస్తి చెప్పాలని డిమాండ్ చేశారు. విలువైన ఆర్టీసీ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పరిరక్షించాలని, విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రవేట్ వ్యక్తులకు కాకుండా ఆర్టీసీలకే మొత్తం అప్పగించాలని కోరుతూ కర్నూలు కొత్త బస్టాండ్ ఆవరణలో ఈ నెల 28న ఉదయం 11 గంటలకు జరిగే నిరసన ప్రదర్శనలో ఉద్యోగులు, కార్మికులు, ప్రజలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.



నిరసన ప్రదర్శన కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు



వేడుకల్లో పాల్గొన్న డాక్టర్ శంకర్ శర్మ

విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకోవాలి

- ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్యులు డాక్టర్ శంకర్ శర్మ పేర్కొన్నారు. కర్నూలు నగరంలోని డాక్టర్స్ కాలనీలో ఉన్న భాష్యం పాఠశాలలో ఫ్రెషర్స్ డేను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. ఫ్రెషర్స్ డే అంటే ఉల్లాసంగా ఉత్సాహంగా గడపడమన్నారు. నిజంగా ఉల్లాసంగా ఉత్సాహంగా ఉండడం అంటే నిశబ్దంగా ఉండడం అని తెలిపారు. విద్యార్థులు ఏకాగ్రతతో పెద్దవారు, ఉపాధ్యాయులు చెప్పే విషయాలు వినాలన్నారు. విద్యార్థి దశలో తాను బాగా చదువు కోవడంతో నేడు ఉన్నతస్థానంలో ఉన్నానని, అప్పుడు పరిస్థితులు ఎంతో కష్టంగా ఉండేవని, ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవన్నారు. తమ పిల్లలు మంచి స్థానంలో ఉండాలని తల్లిదండ్రులు ఎంతో కష్టపడి మిమ్మల్ని మంచి పాఠశాలలో చదివిస్తున్నారని తెలిపారు. ఎవరైతే విద్యార్థి దశలోనే కష్టపడి చదువుకుంటారో వారే భవిష్యత్తులో ఉన్నతస్థానంలో ఉంటారన్నారు. విద్యార్థులు లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటిని ధృడమైన సంకల్పంతో సమయం వృథా చేసుకోకుండా సాధించుకోవాలన్నారు. సెల్ ఫోన్‌లో జ్ఞానాన్ని పెంచుకునే విషయాలు చూడాలని సమయాన్ని వృథా చేసే ఇతర విషయాలు చూడకూడదన్నారు. చదువుతో పాటు మంచి ఆరోగ్యం కోసం కురగాయలు, పండ్లు తీసుకోవాలని సూచించారు. ప్రతి రోజు వ్యాయామం, క్రీడలతోపాటు కొంత సమయం నిశబ్దంగా ఉంటే ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాష్యం పాఠశాల ప్రిన్సిపాల్ రాంప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చింతమాన్ పల్లి ఎత్తిపోతలకు పూజలు

ప్రజాశక్తి - సిబెళగల్

చింతమానుపల్లి ఎత్తిపోతల పథకానికి సాగునీరందించాలని ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి, కెడిసిసి బ్యాంకు ఛైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డిలు పథకం కమిటీ, రైతుల సమక్షంలో శుక్రవారం పంపు హౌస్ దగ్గర తుంగభద్ర నదిలో పూజ లు చేశారు. టిడిపి మండల కన్వీనర్ చంద్రశేఖర్, సొసైటీ మండల అధ్యక్షులు చిన్న తిమ్మప్ప, నాయకులు ఈరన్న గౌడ్, అమర్‌నాథ్, ధనుంజయ, గొల్లలదొడ్డి లింగన్న, కంపాడు యాకోబు, డిఇ విద్యాసాగర్, ఎఇ పరమేష్, ఎంపిడిఒ రాణెమ్మ పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

తప్పుడు కథనాలు సరికాదు

- న్యాయపరమైన చర్యలు తీసుకుంటా
- రాయలసీమ రేంజ్ డిఐజి కోయ ప్రవీణ్

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

రాజకీయ విద్వేషాలతో కొన్ని పత్రికలు తప్పుడు కథనాలు ప్రచురణ చేయడం సరికాదని, అలాంటి పత్రికలపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని రాయలసీమ రేంజ్ డిఐజి డాక్టర్ కోయ ప్రవీణ్ పేర్కొన్నారు. ఒక ప్రముఖ పత్రికలో తనను వ్యక్తిగతంగా టార్గెట్ చేసి, రాయలసీమలో అనకొండ ఐపిఎస్ వార్తను ప్రచురణ చేసిన నేపథ్యంలో ఆయన స్పందించారు. శుక్రవారం నగరంలోని డిఐజి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... రాజకీయంగా అధికారులపై తప్పుడు వార్తలు ప్రచురణ చేయడం తగదన్నారు. గతంలో విశాఖపట్నంలో తాను ఎస్పీగా పని చేసిన కాలంలో గంజాయి సాగు పెద్దఎత్తున రవాణా జరిగినట్లు పేర్కొన్నారు. అసాంఘిక కార్యక్రమాలు జరిగాయని చెప్పారు. ఆ సమయంలో వాటిని కట్టడి చేసినట్లు తెలిపారు. తాను పనిచేసిన ప్రాంతాల్లో అసాంఘిక కార్యక్రమాలపై నిబద్ధతో పని చేయడం కొందరు రాజకీయ దళారులకు నచ్చలేదన్నారు. తనపై గతంలో అనేక కుట్రలు చేశారని అన్నారు. ఆ కుట్రలను సైతం ధీటుగా ఎదుర్కొన్నట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం కుట్ర పూరిత చర్యలకు ప్రయత్నం జరుగుతోందని, అందులో భాగంగానే నేడు తప్పుడు వార్తను ప్రచురించారని తెలిపారు. వ్యవస్థలో పాతుకుపోయిన దళారుల వల్ల నిబద్ధత కలిగిన అధికారులపై ఇలాంటి కుట్రపూరిత చర్యలు చోటు చేసుకుంటాయని చెప్పారు. తనపై తప్పుడు వార్త ప్రచురణ చేసిన సంస్థ, సిబ్బందిపై న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



పట్టుదలతో సాధన చేస్తే రాణింపు

- కర్నూలు మేయర్ బివై.రామయ్య

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

విద్యార్థులు క్రీడారంగంలో రాణించాలంటే పట్టుదలతో సాధన చేయాలని కర్నూలు నగరపాలక సంస్థ మేయర్ బివై.రామయ్య తెలిపారు. శుక్రవారం అవుట్ డోర్ స్టేడియంలో మేయర్, కార్పొరేటర్లు లక్ష్మీకాంత్ రెడ్డి, విక్రమ్ సింహారెడ్డితో కలిసి జిల్లా స్థాయి ఫ్లోర్ బాల్ ఎంపిక పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడారు. నూతన క్రీడల ద్వారా అవకాశాలు మెండుగా ఉంటాయని, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాకారులను ప్రోత్సహించాలని సూచించారు. తల్లిదండ్రులతోపాటు క్రీడారంగంలో విద్యార్థులను ప్రోత్సహించడంలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. అనంతరం కార్పొరేటర్లు లక్ష్మీకాంత్ రెడ్డి, విక్రమ్ సింహారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణతో రోజూ సాధన చేయాలని సూచించారు. రాష్ట్ర హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి డాక్టర్ రుద్ర రెడ్డి, జిల్లా ప్రయివేట్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, జిల్లా ఫ్లోర్ బాల్ సంఘం కార్యదర్శి ఈశ్వర్ నాయుడు, జిల్లా యోగా సంఘం ఉపాధ్యక్షులు సాయికృష్ణ, వ్యాయామ ఉపాధ్యాయులు మాధవి, తిరుమణి, లక్ష్మి, శేషు, లక్ష్మన్న మల్లికార్జున, రాహుల్ పాల్గొన్నారు.





నీటిని విడుదల చేస్తున్న నాయకులు

సీమ కరువు, రైతుల కష్టాలు తెలుసు

- మంత్రి వాసంశెట్టి సుభాష్, డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్య ప్రకాష్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే శ్యాం కుమార్
- ఆలంకొండ పంపింగ్ స్టేషన్ నుంచి హంద్రీనీవాకు నీటి విడుదల

ప్రజాశక్తి - క్రిష్ణగిరి

సీమ కరువు, రైతుల కష్టాలు తన తెలుసని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసం శెట్టి సుభాష్ తెలిపారు. హంద్రీనీవా ఫేజ్-1లో భాగంగా పూర్తయిన కాలువలకు క్రిష్ణగిరి మండలం ఆలంకొండ గ్రామం పంపింగ్ స్టేషన్ నుంచి 68 చెరువులకు శుక్రవారం జలాలను విడుదల చేశారు. అనంతరం జలహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్, డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డి, పత్తికొండ ఎమ్మెల్యే కెఇ.శ్యాంకుమార్ మాట్లాడారు. హంద్రీనీవా కాలువ నుంచి చెరువులకు నీళ్లు మళ్లించాలని మాజీ డిప్యూటీ సిఎం కెఇ.కృష్ణమూర్తి ఎంతో కృషి చేశారన్నారు. సీమ దశను మార్చేది నీళ్లేనని చెప్పారు. పత్తికొండ నియోజకవర్గంలో వేరుశెనగ పంట ఎండిపోతే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చామన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో నియోజకవర్గంలో కరువు వల్ల పశువులకు గడ్డి కూడా వేసుకోలేని పరిస్థితి నెలకొంటే.. వేరే ప్రాంతాల నుంచి గడ్డి తెచ్చి ఆ పశువులను కాపాడుకునే పరిస్థితి నెలకొందన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

- కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వక్తలు తెలిపారు. కిమ్స్ హాస్పిటల్, సిఐటియు ముజఫర్ నగర్ కమిటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ వెల్ సీన్ జోన్, సీనియర్ సిటిజన్ అసోసియేషన్, టి.నరసింహయ్య గ్రంథాలయం, టిసి.లక్ష్మమ్మ కుట్టు శిక్షణ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో గ్రంథాలయంలో ఉచిత గుండె, కంటి వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. లయన్స్ క్లబ్ డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ జయప్రకాష్, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీనివాస్, విశ్వభారతి రిటైర్డ్ ప్రిన్సిపల్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ బాషా, సిపిఎం న్యూసిటీ కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప, సిహెచ్.సాయిబాబా, ఆర్.నరసింహులు, ఆటో యూనియన్ (సిఐటియు) జిల్లా కార్యదర్శి, గ్రంథాలయం అధ్యక్షులు కె.ప్రభాకర్, కెవిపిఎస్ నగర సహాయ కార్యదర్శి ఎంసి.ఆనంద్, యునైటెడ్ జర్నలిస్ట్ ఫోరం జిల్లా నాయకులు వి.విజయ్ కుమార్, ప్రజానాట్య మండలి వార్డు కార్యదర్శి సురేష్, సిఐటియు నాయకులు వై.సుధాకర్, ఆరు జేమ్స్ హాజరయ్యారు. డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ జయప్రకాష్, డాక్టర్ శ్రీనివాస్, కె.ప్రభాకర్ మాట్లాడారు. ప్రస్తుతం వైద్యం పేదలకు భారంగా మారిందని, పేదలకు ఎంతో కొంత సహాయం అందించాలని వైద్య శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. పేదలు నివసించే అయ్యప్ప నగర్ లాంటి ఏరియాల్లో ఈ వైద్య శిబిరం నిర్వహించడం అభినందించదగ్గ విషయమని నిర్వాహకులను అభినందించారు. అనంతరం సిపిఎం నాయకులు కె.సుధాకరప్ప, సాయిబాబా, ఆర్.నరసింహులు, ఆటో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.నరసింహ మాట్లాడారు. కార్మిక వర్గం, పేదలు నివసించే ముజఫర్ నగర్‌లో వైద్య శిబిరం నిర్వహించాలని అడిగిన వెంటనే ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించిన కిమ్స్ యాజమాన్యానికి, డాక్టర్లకు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. సిఐటియు, సిపిఎం నాయకులు వై.సుధాకర్, సురేష్, టి.రామనాగిరెడ్డి, గ్రంథాలయ నిర్వాహకులు బషీర్ మియా, బాబు, రహిమాన్, రాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ముజఫర్ నగర్‌లో ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఆకట్టుకున్న 'చౌడేశ్వరి దేవి వైభవం'

ప్రజాశక్తి - కర్నూలు కల్చరల్

టిజివి కళాక్షేత్రంలో శ్రీనందవరం చౌడేశ్వరి దేవి వైభవం పద్య నాటక ప్రదర్శన శుక్రవారం రాత్రి నిర్వహించారు. ఇందులో అమ్మవారి పుట్టుపూర్వోత్తరాలతో పాటు ఆమె ఆరాధన తీరును ప్రొద్దుటూరు చౌడేశ్వరి ఆర్ట్స్ కళాకారులు పాములేటి దర్శకత్వంలో అద్భుతంగా ప్రదర్శించారు. ఈ నాటకాన్ని పల్లేటికుల శేఖర్ రచన చేశారు. నాటక ప్రారంభంలో చౌడేశ్వరి చిత్రపటానికి కళాకారులు పుష్పమాలను సమర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అనంతరం నాటకంలోని కళాకారులను నిర్వాహకులు సన్మానించారు. వారు మాట్లాడుతూ... చౌడేశ్వరి మాత వైభవాన్ని నాటక రూపంలో కర్నూలులో మొదటిసారి ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. తొగట వీర క్షత్రియ సంఘం నిర్వాహకులు చింతా శ్రీనివాసులు, తొగట వెంకటేశ్వర్లు, పోలిశెట్టి రాజకుమార్, నందవరీక బ్రాహ్మణ సంఘం నిర్వాహకులు సుదర్శన్ రావు, సురేష్, దుర్గాప్రసాద్, విశ్వనాథ్, దేవాంగ సంఘం ప్రభాకర్, మదన్, కొండయ్య పాల్గొన్నారు. సుమారు మూడు గంటలపాటు సాగిన ఈ నాటకం ఆద్యంతం భక్తి రసంలో సాగింది.



కళాకారులను సన్మానిస్తున్న అతిథులు

గ్రామస్తులను వీడని చిరుత భయం

- గంజహళ్లి గ్రామాన్ని సందర్శించిన ఫారెస్ట్, వెటర్నరీ సిబ్బంది

ప్రజాశక్తి - గోనెగండ్ల



స్థలాన్ని పరిశీలిస్తున్న ఫారెస్ట్, వెటర్నరీ సిబ్బంది

మండలంలోని గంజహళ్లి గ్రామస్తులను చిరుతపులి భయం ఇంకా వీడలేదు. దున్నపోతును చంపి తిన్న పరిసర ప్రదేశంలోనే ఇంకా చిరుత పులి సంచరిస్తోందని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ సీజన్ పచ్చని పంటలతో రైతులు, వ్యవసాయ కూలీలు తీరిక లేకుండా ఉన్న సమయంలో వ్యవసాయ పనులకు వెళ్లాలంటేనే భయపడుతున్నారు. శుక్రవారం గ్రామాన్ని ఫారెస్ట్ అధికారి, పశువైద్యులు సందర్శించారు. వారు గ్రామస్తులతో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. దున్నపోతు కళేబరానికి పంచనామా చేయాలని పశు వైద్యులు ప్రయత్నించినప్పటికీ దుర్వాసన వెదజల్లడంతో సాధ్యం కాకపోవడంతో సమాచారం. ఒంటరిగా బయటకు వెళ్లరాదని, తగిన జాగ్రత్తలు పాటించి చిరుతబారి నుంచి జాగ్రత్తగా ఉండాలని ఫారెస్ట్ అధికారి గ్రామస్తులకు సూచించారు. చిరుత పులి ఎవరికైనా కనిపిస్తే తమకు వెంటనే సమాచారం ఇవ్వాలని కోరారు. వీలైనంత త్వరగా చిరుత పులి భయం వీడితే తప్ప గ్రామస్తులు సాధారణ జీవితంలో ఇమడలేరని పలువురు గ్రామస్తులు వాపోతున్నారు. వీలైనంత త్వరగా చిరుత భయం పోగొట్టేలా తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

- ఎమ్మెల్యే పార్థసారధి, మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని



మాట్లాడుతున్న ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి

పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి రాకుండా శాశ్వత నివారణ చర్యలు చేపడతామని ఎమ్మెల్యే పార్థసారధి, మున్సిపల్ చైర్మన్ లోకేశ్వరి తెలిపారు. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కృష్ణ ఆధ్వర్యంలో బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ వద్ద ఎల్ఎల్సికి జల హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పట్టణానికి ఎన్నో ఏళ్ల నుంచి తాగునీరందిస్తున్న బసాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు మరమ్మతుల కోసం తాత్కాలికంగా రూ.6 కోట్లకు అధికారులు ప్రతిపాదనలు పంపారని తెలిపారు. శాశ్వత మరమ్మతులకు రూ.60 కోట్లు అవసరమవుతాయని నివేదిక ఇవ్వాలని సూచించారు. సమస్యను ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. ప్రస్తుతం మంచి వర్షాలు కురిసి, ఎల్ఎల్సికి నీరు రావడంతో ఎస్ఎస్ ట్యాంకు, రామజల చెరువుకు మళ్లించి పట్టణ ప్రజల అవసరాల దృష్ట్యా రెండు రోజులకోసారి నీరివ్వాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ సత్యనారాయణ, డిఇలు చలపతి, గోవిందు, రామ్మూర్తి, కౌన్సిలర్లు సురేష్, చిన్న, ఇందు, ఉద్యోగిని పావని పాల్గొన్నారు.

ఘనంగా బ్యాంకు మహాజన సభ

ప్రజాశక్తి - ఆదోని రూరల్



మాట్లాడుతున్న చైర్మన్

పట్టణంలోని శ్రీమహాయోగి లక్ష్మమ్మ కో ఆపరేటివ్ బ్యాంకు లిమిటెడ్ మహాజనసభ బ్యాంకు చైర్మన్ రాయచోటి రామయ్య ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బ్యాంకు లావాదేవీలు, అందిస్తున్న సేవల గురించి వివరించారు. బ్యాంకు మార్చి 31, 2025 నాటికి రూ.263.68 కోట్ల డిపాజిట్లతో, రూ.183.86 కోట్ల రుణాలతో, నెట్ ఎన్పిఎ 0.78 శాతంతో, రూ.2.08 కోట్ల నికర లాభాలతో ముందంజలో ఉందని తెలిపారు. బిఒఎమ్ సుబ్బయ్య పాల్గొన్నారు.

వైభవంగా ధ్వజారోహణ, గణపతి పూజ

ప్రజాశక్తి - కౌతాళం



పూజలు నిర్వహిస్తున్న అధికారులు

ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రాల్లో ఒకటైన శ్రీలక్ష్మి నరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి శ్రావణమాసోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం ధ్వజారోహణ, గణపతి పూజలు డిప్యూటీ కమిషనర్ విజయరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితులు మురళీ కృష్ణ శర్మ, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, ఉప ప్రధాన అర్చకులు మహదేవ స్వామి, ముఖ్య అర్చకులు ఈరన్న, మల్లయ్య, నాగ రాజు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం సమీపంలోని తుంగభద్ర ఎగువ ఉప కాలవలో అభిషేకం చేశారు. భక్తుల సమక్షంలో వైభవంగా నిర్వహించారు. పర్యవేక్షకులు వెంకటేష్, మల్లికార్జున, సీనియర్ అసిస్టెంట్ కిరణ్, కుమార్, వీరేష్ పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం..!

- ఐదేళ్లుగా కలుషితమవుతున్న తాగునీరు
- అధికారులకు విన్నవించినా స్పందన కరువు

ప్రజాశక్తి - నందవరం

ప్రజల ఆరోగ్యాలపై నందవరం గ్రామానికి చెందిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలు తాగే నీరు కలుషితమవుతున్నా పట్టించుకోవడం లేదు. చాలా సందర్భాల్లో అధికారులకు సమస్యను తెలిపినా స్పందించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు.



లీకేజీ కావడంతో కలుషితమవుతున్న నీరు

ప్రజల ఆరోగ్య పరిస్థితి ఎలా పాడవుతున్నా ఏమీ పట్టనట్టు నందవరం గ్రామానికి చెందిన అధికారులు వ్యవహరిస్తున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. గ్రామస్తులు తాగే నీరు గత ఐదేళ్లుగా కలుషితమవుతున్నాయి. ఆ నీటిని తాగి ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారు. నందవరం రహదారిపై టిడిపి హయాంలో ప్రజలకు తాగినీటిని సరఫరా చేసేందుకు పైపులైన్ నిర్మాణం చేపట్టి అక్కడ 'వాల్వ్' ఏర్పాటు చేశారు. అప్పటి నిర్వాహకులు ఆ వాల్వ్‌పై ఒక రాతిబండను ఏర్పాటు చేసి దాన్ని కాపాడుకుంటూ ప్రజలకు నీరందించే వారు. ప్రస్తుతం వాల్వ్ లీక్ అవుతోంది. లీకు ఏర్పడి సుమారు ఐదేళ్లవుతోందని ప్రజలు పేర్కొంటున్నారు. లీకు కావడం వల్ల అక్కడ గుంత ఏర్పడి నీరు నిలిచి ఉంటోంది. వాల్వ్ ఉన్న రహదారిపై మంత్రాలయం, చిలకలదోన, మాచాపురం, ఇబ్రహీంపురం.. సుమారు 15 గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. గ్రామంలోని వాహనాలు, ఎద్దుల బండ్లు ఆ గుంతను తొక్కుతూ వెళ్తుంటాయి. వాహనాలు, ప్రజలు తిరగడం వల్ల గుంతలో నిలిచిన నీరు పూర్తిగా కలిషితమవుతోంది. వాహనాల టైర్లకు అంటుకున్న వ్యర్థాలు అందులోనే పడి నీరు కలుషితమవుతున్నాయి. ఆ నీళ్లలో కుక్కలు, పందులు దొర్లుతూ ఉంటాయి. ఇంత దుర్భరమైన నీరు వాల్వ్ ద్వారా ప్రవహించే తాగునీటిలో కలిసి ప్రజలకు చేరుతున్నాయి. ఐదేళ్లుగా ప్రజలు కలుషితమైన నీరు తాగుతున్నా అధికారులు మాత్రం పట్టించుకోపోవడం బాధాకరం.

అధికారులకు చెప్పినా స్పందించడం లేదు

- సుభాన్ బాషా, నందవరం గ్రామం



వాల్వ్ లీకు కావడంతో నీరు వదిలిన సమయంలో లీకు అవుతున్నాయి. లీకు కావడం వల్ల నీరు నిల్వ ఉండడంతో పక్కనే ఉన్న మా ఇంటి గోడలు దెబ్బతింటున్నాయి. కలుషితమైన నీరు తిరిగి పైపుల్లోకి వెళ్లడం వల్ల ఆ నీరు తాగి రోగాల బారిన పడుతున్నాం. సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినా స్పందించడం లేదు. అధికారులు స్పందించి ప్రజల ఆరోగ్యాలను కాపాడాలి.

సమస్యను పరిష్కరిస్తాం

- డిప్యూటీ ఎంపిడిఒ సందీప్



అక్కడ సమస్య ఉందన్న విషయం నా దృష్టికి రాలేదు. పంచాయతీ సిబ్బందికి తెలియజేశాను. సమస్యను త్వరగా పరిష్కరిస్తాం.

రహదారి ఏర్పాటుకు ప్రతిపాదనలు

- ఆర్అండ్‌బి ఎఇ సాయిసురేష్

ప్రజాశక్తి-ఆదోనిరూరల్



మండలంలోని పూర్తిగా దెబ్బతిన్న రహదారులకు ప్రతిపాదనలు పంపించామని ఆర్అండ్‌బి ఎఇ ఎన్.సాయి సురేష్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. మహాయోగి లక్ష్మమ్మ అవ్వ ఆర్చి నుంచి సిరుగుప్ప బైపాస్ రోడ్డు, జై హింద ఆర్చి నుంచి కొత్తబస్టాండ్ వరకు, పెద్దహరివాణం గ్రామంలో పోయే రస్తాలో బ్రిడ్జి నిర్మాణం, ఢణాపురం-హోళగుంద రోడ్డుకు సంబంధించి ప్రతిపాదనలను ఉన్నతాధికాలకు పంపించామని తెలిపారు. ఇప్పటికే కొన్ని రోడ్ల టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో ఆ పనులు ప్రారంభిస్తామని చెప్పారు. పెద్దహరివాణం-హెబ్బటం రూ.3 కోట్లతో, పెద్దహరివాణం గ్రామం పోయే రస్తా ఇటిక్యాల్ నుంచి సరిహద్దు వరకు రూ.3 కోట్లతో, హనవాల్ పోయే రాస్తాకు టెండర్లు పూర్తయ్యాయని, త్వరలో పనులు ప్రారంభిస్తామని తెలిపారు.

అదనపు బస్సు సర్వీస్‌పై డివైఎఫ్ఐ హర్షం

ప్రజాశక్తి - దేవనకొండ

దేవనకొండ నుంచి జిల్లేడుబుడకలకు వెళ్లే విద్యార్థి బస్సు అదనంగా ఏర్పాటు చేయడం పట్ల డివైఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు మహేంద్ర, శ్రీనివాసులు హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ... విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజాసంఘాల డిమాండ్ మేరకు ఆర్‌టిసి అధికారులు మాదాపురంకు ప్రత్యేకంగా అదనపు విద్యార్థి బస్సు నడపడం హర్షించదగ్గ విషయమన్నారు. సకాలంలో స్పందించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- దేవనకొండ

దేవనకొండలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామస్తులు, కుటుంబ సభ్యుల వివరాల మేరకు... శుక్రవారం గ్రామానికి చెందిన కమ్మరి రాజు (40) భారత్ పెట్రోల్ బంకు సమీపంలో బైక్ వేసుకుని ఇంటికి వెళ్తుండగా మతిస్థిమితం లేని గొల్ల కృష్ణమూర్తి రహదారిపైకి అకస్మాత్తుగా రావడంతో బైక్ ఆయనను ఢీకొట్టింది. కృష్ణమూర్తికి స్వల్ప గాయాలు కాగా కమ్మరి రాజుకు తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో పత్తికొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే రాజు మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

హంద్రీనీవా పంట కాలువకు గండి

- గ్రామస్తుల సహాయంతో పూడ్చివేత

ప్రజాశక్తి- దేవనకొండ

మండలంలోని తువ్వదొడ్డి గ్రామ సమీపంలో హంద్రీనీవా పంట కాలువకు శుక్రవారం గండి పడింది. గండిపడిన చోట వాగు ఉండడంతో పంట కాలువ నీరు అందులోకి ప్రవహించింది. సమీపంలో పొలాలు లేకపోవడంతో ఎలాంటి నష్టమూ కలుగలేదు. పంట కాలువ గండిని గమనించిన గ్రామ రైతులు సంబంధిత హంద్రీనీవా ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించి ఇంజినీర్ మల్లికార్జున్ రెడ్డి ఆధ్వర్యంలో జెసిబిలతో పంట కాలువ గండిని పూడ్చారు.



తువ్వదొడ్డి దగ్గర గండి పడిన పంట కాలువ

చదువుతో జీవితానికి భద్రత

- డాక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

విద్యార్థులు చదువుకోవడం వల్ల జ్ఞానం, నైపుణ్యాలు సంపాదించడమే కాకుండా సామాజికంగా, ఆర్థికంగా కూడా అభివృద్ధి చెందుతారని శ్రీమల్లికార్జున ఆర్థోపెడిక్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ సి.మల్లికార్జున, యాపిల్ డయాగ్నోస్టిక్ సెంటర్ అధినేత కె.బీరప్ప, ప్రధానోపాధ్యాయులు డి.నాగన్న పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బోడబండ గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు మల్లికార్జున ఆర్థోపెడిక్ హాస్పిటల్, యాపిల్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. చదువు విద్యార్థుల జీవితానికి స్థిరత్వం, భద్రతను కల్పిస్తుందని తెలిపారు. చదువు వల్ల ఆలోచన విధానం మారుతుందని, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతుందని చెప్పారు. ఉపాధ్యాయులు నల్లన్న, ప్రమీల, హాస్పిటల్ మేనేజర్ నరసింహులు, గ్రామ పెద్దలు తమ్మయ్య, మార్లపాటి వెంకటేశ్వర్లు, పైరాజ్యం వెంకటరాముడు, సురేష్ చౌదరి, జగదీశ్ చౌదరి, పైరాజ్యం తిక్కయ్య, కడివెళ్ల హనుమంతు, వడ్డే మధు, ప్రహ్లాద, చెన్నప్ప, కురువ శంకర్, పైరాజ్యం వీరేష్, లక్ష్మన్న పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ మల్లికార్జున

సర్పంచి ప్రహ్లాదరెడ్డికి పితృవియోగం

- వైసిపి యువజన విభాగం రాష్ట్ర సెక్రటరీ చంద్రశేఖర్ పరామర్శ

ప్రజాశక్తి - హాలహర్వి

మండలంలోని మెదెహాల్ సర్పంచి ప్రహ్లాదరెడ్డికి పితృవియోగం కలిగింది. శుక్రవారం వైసిపి యువజన విభాగం రాష్ట్ర సెక్రటరీ, ఎమ్మెల్యే విరుపాక్షి తనయుడు బి.చంద్రశేఖర్ ప్రహ్లాదరెడ్డి తండ్రి బసవన్న గౌడ్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రహ్లాద రెడ్డిని పరామర్శించారు. వైసిపి మండల కన్వీనర్ రామి రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న చంద్రశేఖర్, నాయకులు

పేదరిక నిర్మూలనే పి4 లక్ష్యం

- సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారధి

ప్రజాశక్తి-ఆదోని

పేదరికాన్ని నిర్మూలించడమే పి4 లక్ష్యమని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఎమ్మెల్యే పార్థసారధి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని దానిష్ హాలులో 'స్వర్ణాంధ్ర-2047' విజన్ ప్లాన్‌లో భాగంగా పేదరిక నిర్మూలనకు పి4 విధానంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. పేదరిక నిర్మూలనకు పి4 విధానాన్ని ప్రవేశపెట్టి నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలనేది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచన అని తెలిపారు. సమాజంలో పేదలు, నిరుపేదలు, మధ్యతరగతి, ఉన్నత వర్గాల వారు ఉంటారని, అట్టడుగున ఉన్న 10 శాతం నిరు పేదలను ఉన్నత స్థాయిలో ఉన్న 20 శాతం సంపన్నులు వ్యక్తిగతంగా, కుటుంబ పరంగా, సామాజిక పరంగా సహాయ, సహకారాలు అందించేందుకు ముందుకు రావాలని తెలిపారు. సమాజంలో సహాయం చేసే మనస్సు ఉన్న చాలా మంది ఉన్నారని, వారు ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఆర్థిక, సామాజిక, నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని తెలిపారు. రజక కార్పొరేషన్ చైర్మన్ సావిత్రి, డీఎస్పీ హేమలత, ఎంపిపి దానమ్మ, మున్సిపల్ కమిషనర్ కృష్ణ, తహశీల్దార్ రమేష్, ఎంపిడిఒ జనార్ధన్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారధి

మంత్రాలయం : నియోజకవర్గంలో 6 వేల నుంచి 10 వేల బంగారు కుటుంబాలను ఆగస్టు నాటికి గుర్తిస్తామని టిడిపి ఇన్‌ఛార్జీ ఎన్.రాఘవేంద్ర రెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఒ కార్యాలయంలో సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ నేతృత్వంలో పి4పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ మాట్లాడారు. 2029 నాటికి రాష్ట్రంలో పేదరికాన్ని రూపుమాపాలని ముఖ్యమంత్రి సూచించారని తెలిపారు. పి4పై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించాలని ముఖ్యమంత్రి ఆదేశించారని చెప్పారు. అనంతరం ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి నరవ రమాకాంత్ రెడ్డి, నాయకులు నరవ శశిరేఖ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాఘవేంద్ర రెడ్డి

జిల్లాలోనే ఆదోని టాప్

- టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

జిల్లాలో 'సుపరిపాలన తొలిఅడుగు' నిర్వహించడంలో ఆదోని మొదటి స్థానంలో ఉందని, సమిష్టి కృషితోనే సాధ్యమైందని టిడిపి ఇన్‌ఛార్జీ మీనాక్షి నాయుడు తెలిపారు. శుక్రవారం పట్టణంలోని 40వ వార్డు కిల్చిన్ పేటలో 'సుపరిపాలనలో తొలి అడుగు' ఆ వార్డు నాయకులు కిడ్డి శంకర్, యువరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ అబ్జర్వర్ ధర్మవరం సుబ్బారెడ్డి, కురువ కార్పొరేషన్ చైర్మన్ మాన్వి దేవేంద్రప్ప, మాజీ ఇన్‌ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు హాజరయ్యారు. ఇంటింటికీ తిరిగి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సంక్షేమ పథకాలు ముద్రించిన కరపతాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీనాక్షి నాయుడు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజలు ఎన్నో అన్యాయాలను అనుభవించారని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, శాశ్వత సంక్షేమం చంద్రబాబు నాయుడితోనే సాధ్యమని చెప్పారు. టిడిపి కర్నూలు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి భూపాల్ చౌదరి, నాయకులు రంగస్వామి నాయుడు, శ్రీకాంత్ రెడ్డి, రామస్వామి, శంకర్, నీలకంఠప్ప, బసవరాజు, కృష్ణారెడ్డి, అప్సర్ బాష, రంగన్న, తిమ్మప్ప, గుడిసె శ్రీరాములు, నరసింహులు, లక్ష్మీనారాయణ, యువరాజ్, నాగరాజు, అల్తాఫ్, అంజి, హుసేని, బ్రహ్మ, బిచ్చ అంజనప్ప, బాబులు, మహేష్, వెంకన్న, రసూల్, మహానంది, గిడ్డయ్య, శివ, కిష్టప్ప, వీరేష్, హర్ష, శ్రీదేవి, శ్రీరాములు, గోపాల్ పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని అంబేద్కర్ నగర్‌లో 'సుపరిపాలనకు తొలి అడుగు' నిర్వహించారు. వార్డు నాయకులు చుక్క గోవిందరాజులు, సి.నాగరాజు, రామచంద్ర, ఆంజనేయులు ఆధ్వర్యంలో కార్యక్రమం సాగింది. అంతకు ముందు టిడిపి సీనియర్ నాయకులు సూరం భాస్కర్ రెడ్డి బృందానికి వార్డు నాయకులు స్వాగతం పలికారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుని సంక్షేమ పథకాల గురించి వివరించారు. మాజీ కౌన్సిలర్ రామచంద్ర, ఫక్రుద్దీన్, బుద్ధారెడ్డి, సోమశేఖర్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ మల్లికార్జున, ఇస్వి శ్రీనివాసులు, బి.నాగరాజు, బిటి.శీన, మద్దికెర రామకృష్ణ, నారాయణపురం షాషావలీ, ఎమ్‌డి.హుస్సేన్, వాల్మీకి రాముడు, రమేష్, టిడిపి సోషల్ మీడియా కార్యకర్త మదిరే శ్రీనివాస్, మల్లేష్ పాల్గొన్నారు. **కౌతాళం** మండలం హాల్వి గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహించారు. టిడిపి నాయకులు సురేష్ నాయుడు, అడివప్ప గౌడ్, సతీష్ నాయుడు, రాకేష్ రెడ్డి, రాజారెడ్డి, రామలింగ, పట్టాభి, సోము, హనుమంతు, నాగేష్, గోపాల్ నాయక్, కృష్ణ, చిన్న సిద్ధప్ప, చూడి రోహిత్, లక్కే గోవింద్, కాత్రికి చంద్ర, గోపాల్, మహంతేష్, మల్లి గౌడ్, ఎరిగేరి నాగరాజు, లింగేష్, కోట్ల బాషా, కురువ వీరేష్, వేనప్ప, నాగేష్ పాల్గొన్నారు.



ఆదోనిలో సమస్యలు తెలుసుకుంటున్న మీనాక్షి నాయుడు



కౌతాళంలో కరపత్రాలను అందజేస్తున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణకు కృషి

- టిడిపి యువ నాయకులు బడేసాబ్ వలీ

ప్రజాశక్తి - నందవరం



మొక్కలు నాటుతున్న నాయకులు

పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు టిడిపి మాచాపురం యువ నాయకులు బడేసాబ్ వలీ తెలిపారు. శుక్రవారం మాచాపురం గ్రామంలో 2,500 మొక్కలను నాటారు. ఎమ్మెల్యే బీవీ సహకారంతో టిడిపి మండల కన్వీనర్ ఎస్.ఖాసీంవలీ ఆదేశాలతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు గ్రామస్తులు కృషి చేయాలని ప్రజలకు సూచించారు. నాటిన మొక్కలను కాపాడుకోవాలని సూచించారు.

జిల్లా మహాసభలను జయప్రదం చేయండి : సిపిఐ

ప్రజాశక్తి - హాలహర్వి

ఆగస్టు 9, 10, 11వ తేదీల్లో జరిగే కర్నూలులో సిపిఐ జిల్లా 24వ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య కోరారు. శుక్రవారం హాలహర్విలో గోడ పత్రికలు విడుదల చేశారు. ఎఐటియుసి తాలూకా కార్యదర్శి వి.రంగన్న, సిపిఐ మండల నాయకులు నాగరాజు, ఎఐటియుసి నాయకులు నల్లారెడ్డి, శివప్ప, లింగప్ప, మల్లికార్జున, దేవేంద్రప్ప, బీరప్ప, చంద్రప్ప, సిద్ధప్ప, రమేష్, హనుమంతు, అంజి, రంగస్వామి, చంద్ర, వంద్రప్ప పాల్గొన్నారు.

ఈ-పట్టాదారు పాసు పుస్తకాలివ్వాలి

- తహశీల్దార్‌తో రైతుల మొర

ప్రజాశక్తి - మంత్రాలయం



వినతిపత్రం అందజేస్తున్న రైతులు

మండలంలోని మంచాల గ్రామంలో అనుభవంలో ఉన్న భూములను ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసి ఈ-పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని రైతులు తహశీల్దార్ కె.రమాదేవితో మొర పెట్టుకున్నారు. శుక్రవారం గనేకంటి సున్నం భీమయ్య కుమారుడు గనేకంటి సున్నం రఘు ఆధ్వర్యంలో సుమారు 10 మంది రైతులు తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు కామాటి రాఘన్న మాట్లాడారు. 300 ఏళ్లుగా తమ పెద్దల కాలం నుంచి ఆ భూముల్లో సాగులో ఉన్నామని తెలిపారు. ఆ భూములను ఇనాం భూములుగా వర్గీకరించి పైమాసి, సర్వే నెంబర్లను ఇనాం రద్దు, రైతువారీగా మార్చే 1956 చట్టం ప్రకారం 1975లో తమ పెద్దలకు అప్పటి ఆదోని ఇనాం డిప్యూటీ తహశీల్దార్ నోటీసులు కొందరికే జారీ చేశారని పేర్కొన్నారు. తమ పెద్దలు నిరక్షరాస్యులు కావడం వల్ల హాజరు కాలేదని తెలిపారు. 1970లో రైతులకు ఎలాంటి సమాచారం, నోటీసులు ఇవ్వకుండా భూములను రీ సర్వే చేశారని, ఫైర్ లాండ్ రిజిస్టర్‌ను తయారు చేశారని చెప్పారు. ఎఫ్ఎల్ఆర్‌లో తమకు చెందిన సర్వే నెంబర్లు నమోదు ఉన్నప్పటికీ రిజిస్ట్రేషన్లు అయినా పట్టాదారు పాసు పుస్తకాలు పొందలేక పోతున్నామని వాపోయారు. ప్రజా వేదిక ఏర్పాటు చేసి విచారణ జరిపి తమకు చెందిన భూములను ఆన్‌లైన్‌లో నమోదు చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని కోరారు. రైతులు వీరయ్య శెట్టి, వై.నరసింహులు, కామాటి గోవిందు, వనికె గురురాజ, హండే అనుమంతు, బంగి శ్రీనివాసులు, పిల్లి భీమేష్ పాల్గొన్నారు.

వైద్య వృత్తి పవిత్రమైనది

- ప్రభుత్వ డాక్టర్ అప్రోజ్ జహాన్

ప్రజాశక్తి - చిప్పగిరి

వైద్య వృత్తి ఎంతో పవిత్రమైందని, రోగులకు సేవ చేయడం అందరికీ దొరకదని ప్రభుత్వ డాక్టర్ అప్రోజ్ జహాన్ తెలిపారు. శుక్రవారం చిప్పగిరి ప్రభుత్వాస్పత్రి ఆవరణలో ఇక్కడి నుంచి ఆలూరుకు బదిలీపై వెళ్తున్న ఎఎన్ఎంలు సువర్ణ, పద్మావతి, విజయలక్ష్మి, అటెండర్ వీరన్నను సిహెచ్ఒ వెంకటేశ్వర్లు, ఆస్పత్రి సిబ్బంది పూలమాల, శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రతి ఉద్యోగికీ బదిలీ సర్వసాధారణమని తెలిపారు. విధుల్లో పారదర్శకత ఉండాలన్నారు. అప్పుడే ప్రజల్లో, సమాజంలో మంచి పేరు వస్తుందని తెలిపారు. వైద్య వృత్తిలో ఉన్నప్పుడు ఇంటి సమస్యలను కూడా మరిచిపోయి రోగులకు వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. బదిలీపై వెళ్తున్న ఎఎన్ఎంలు మాట్లాడుతూ... తమకు ఇక్కడి నుంచి వెళ్లిపోతున్నందుకు కొద్దిగా బాధగా ఉన్నా బదిలీలు తప్పవని సర్దుకుంటున్నామని తెలిపారు. తమకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ పార్వతమ్మ పాల్గొన్నారు.



బదిలీపై వెళ్తున్న ఎఎన్ఎంలను సన్మానిస్తున్న ప్రభుత్వాస్పత్రి సిబ్బంది

ఎపిఆర్‌జెసికి 'ప్రతిభ' విద్యార్థిని

ప్రజాశక్తి - కౌతాళం



కౌతాళంలోని ప్రతిభ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని వై.మౌనిక ఎపిఆర్‌జెసి ఎంట్రన్స్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి బనవాసిలోని ఎపిఆర్‌జెసికి ఎంపికైనట్లు కరస్పాండెంట్ సయ్యద్ బాషా తెలిపారు. శుక్రవారం విద్యార్థిని మౌనికను పాఠశాల సిబ్బంది అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పదో తర గతి ఫలితాల్లోనూ 510 మార్కులు సాధించినట్లు తెలిపారు. ఇతర విద్యార్థులు పాలి టెక్నిక్‌లో ప్రతిభ కనబరిచారని చెప్పారు. గ్రామీణ విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయిలో విద్యనందించి బంగారు భవిష్యత్తు అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు తెలిపారు.

ఫిల్టర్ వాటర్ ప్లాంట్లు ప్రారంభం

ప్రజాశక్తి - మంత్రాలయం



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న పీఠాధిపతులు

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో భక్తుల సౌకర్యార్థం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు నీటి శుద్ధీకరణ (ఫిల్టర్ వాటర్ ప్లాంట్)ను ప్రారంభించారు. శుక్రవారం ఎల్ఐసి వారి ఔదార్యంతో శ్రీమఠం ఆవరణలోని శ్రీమధ్వ మార్గ కారిడారు ప్రధాన ముఖద్వారం వద్ద, శ్రీసుయతీంద్ర తీర్థుల అతిథి గృహం వద్ద ఏర్పాటు చేసిన ప్లాంట్లను పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. భక్తుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమైన ప్రదేశాల్లో ఇప్పటికే అనేక నీటి శుద్ధీకరణ ప్లాంట్లు ఏర్పాటు చేసిన పీఠాధిపతులు ఎల్ఐసి వారి చొరవతో రెండు కొత్త నీటి శుద్ధీకరణ ప్లాంట్లను అందుబాటులోకి తెచ్చారు. ఎల్ఐసి జోనల్ మేనేజర్ పునీత్ కుమార్, చీఫ్ ఇంజినీర్ ఎఎం.హిలాలీ, ఎస్‌డిఎం వైవి.రావు, శ్రీమఠం ఎఎఒ ఎల్.మాధవ శెట్టి, మేనేజర్లు ఎస్‌కె.శ్రీనివాస్ రావు, వెంకటేష్ జోషి, సురేష్ కోనాపూర్, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి : ఎఒ

ప్రజాశక్తి- దేవనకొండ

ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటలను తప్పనిసరిగా నమోదు చేయించాలని ఎఒ ఉషారాణి రైతులకు సూచించారు. శుక్రవారం దేవనకొండ గ్రామ శివారులో పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పంట నమోదు కోసం గ్రామాల్లో ఉండే రైతు సేవా కేంద్రాల్లో రైతు పొలం పాసు పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్, వన్‌బి అడంగల్, పంట నమోదు దరఖాస్తు సమర్పించాలన్నారు. మండలంలో కౌలు రైతు కార్డు చేయించుకోకపోతే వీలైనంత త్వరగా చేయించుకోవాలన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు మల్లికార్జున, అబ్దుల్ సలాం, గ్రామ వ్యవసాయ అధికారి కళావతి బాయి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యేకు సిపిఎం వినతి


తాండ్రపాడులో ఎమ్మెల్యే దస్తగిరికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

కర్నూలు మండలం ఈ.తాండ్రపాడు గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సిపిఎం కర్నూలు రూరల్ మండల కార్యదర్శి పిబి.హుస్సేనయ్య, సర్పంచి బాలపీరా కోరారు. శుక్రవారం ఈ.తాండ్రపాడు గ్రామంలో 'సుపరిపాలన తొలి అడుగు'కు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి హాజరయ్యారు. వారు ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడారు. తాండ్రపాడు గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, పంచలింగాల గ్రామం తుంగభద్ర నది నుంచి ఇంటింటికి కుళాయిలు వేసి తాగునీటిని సరఫరా చేయాలని కోరారు. గ్రామంలో లింగమన్న కట్ట నుంచి ఆటో స్టాండ్ వరకు, గోకారమయ్య కట్టల దగ్గర, మారమ్మ గుడి దగ్గర, మాలగేరిలో సిసి రోడ్లు వేయాలన్నారు. ఇందిరమ్మ కాలనీలో పైభాగంలో తాగునీటి హెడ్ వాటర్ ట్యాంకులు ఏర్పాటు, మురుగు కాలువల నిర్మాణం, ఇందిరమ్మ కాలనీలో విద్యుత్ 11 కేబుల్ లైను ఇళ్ల మిద్దెలపై నుంచి తొలగించి రోడ్డు వెంట వేయాలని కోరారు. రజకులకు కుంటపై ధోబిఘాట్లు ఏర్పాటు చేయాలన్నారు. అర్హులందరికీ పింఛను మంజూరు చేయాలని తెలిపారు. గొర్ల కాపరులకు ప్రభుత్వ స్థలాల్లో గొర్ల షెడ్లను వేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ... సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిపిఎం నాయకులు తెలుగు వెంకట్ స్వామి, పిఎమ్‌డి.హుస్సేన్, రమ్మతుల్లా, కె.నాగేష్, కెఐ.అయ్యన్న, చెట్టుకింద శీను, టి.రాముడు, రంగస్వామి పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలి

- తహశీల్దార్ గుండాల నాయక్, ఎంపిడిఒ కొండయ్య



ప్రజాశక్తి - మద్దికెర

పేదరిక నిర్మూలనే పి4 ప్రధాన లక్ష్యమని, బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవాలని తహశీల్దార్ గుండాల నాయక్, ఎంపిడిఒ కొండయ్య కోరారు. బంగారు కుటుంబాలను దత్తత తీసుకొని, వారిని పేదరికం నుంచి బయటకు తీసుకు రావడానికి పారిశ్రామిక వేత్తలు, ప్రభుత్వ అధికారులు మార్గదర్శులుగా ముందుకు రావాలని తెలిపారు. శుక్రవారం ఎంపిడిఒ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్రంలో పేదరికం లేకుండా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు పి4 కార్యక్రమం రూపొందించారని వివరించారు.

స్థాయి సంఘ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన

ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ స్థాయి సంఘం ఎన్నికల్లో పోటీ చేసేందుకు నామినేషన్లు వేసిన అభ్యర్థుల నామినేషన్ల పత్రాల పరిశీలన ప్రక్రియ శుక్రవారం నిర్వహించారు. నగరపాలక కార్యాలయంలో అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ అధ్యక్షతన అభ్యర్థుల సమక్షంలో పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి, సక్రమంగా ఉండటంతో అన్నింటినీ ఆమోదించినట్లు అదనపు కమిషనర్ ఆర్జీవి కృష్ణ పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ చిన్నరాముడు, సినియర్ అసిస్టెంట్ జిఎం. శ్రీకాంత్, అభ్యర్థులు నారాయణ రెడ్డి, షేక్ అహ్మద్, కార్పొరేటర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

31లోగా పిఎం బీమా చేయించుకోండి : ఎఒ రవి



ప్రజాశక్తి - మద్దికేర

ఈ నెల 31లోపు ప్రధాన మంత్రి ఫసల్ యోజన బీమాను రైతులు తప్పనిసరిగా చేయించుకోవాలని ఎఒ రవి కుమార్ తెలిపారు. వ్యవసాయ కార్యాలయంలో ఆయన శుక్రవారం అధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రైతులందరు వరి, కంది, ఉల్లి, కొర్ర సజ్జ, టమోటా పంటలకు నిర్ణీత గడువులోగా ప్రీమియం చెల్లించి రసీదు పొందాలన్నారు. వాతావరణ బీమా కింద పత్తి వేరుశనగ వేసిన రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు పొందినట్లయితే బ్యాంకు అధికారులను సంప్రదించి వాతావరణ బీమా చెల్లించాలని కోరారు. మండలంలోని అన్నధాత సుఖీభవ పథకం కింద 189 మంది రైతులకు ఎన్‌పిసిఐకు ఆధార్ బ్యాంక్ పాస్ బుక్కు లింకు కాలేదన్నారు. ఎన్‌పిసిఐకు లింకు కాని రైతులు ఒరిజినల్ ఆధార్ కార్డు తీసుకొని తమ పరిధిలో ఉన్న పోస్ట్ ఆఫీస్ అకౌంట్ చేయించుకోవాలని రైతులకు సూచించారు.

విద్యా రంగ సమస్యలపై నిరంతరం పోరాటం

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా



ప్రజాశక్తి - మద్దికేర

విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం ఎస్‌ఎఫ్‌ఐ నిరంతరం పోరాటాలు చేస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు అబ్దుల్లా పేర్కొన్నారు. మద్దికేర మండల కేంద్రంలోని స్థానిక ఆదర్శ పాఠశాలల్లో ఎస్‌ఎఫ్‌ఐ మండల నూతన మహాసభను ఎస్‌ఎఫ్‌ఐ మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కడవల రవికుమార్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యా రంగంలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం నాటికీ నేటికీ పోరాటాలు నిర్వహించడంలో ఎస్‌ఎఫ్‌ఐ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. మద్దికేర మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కాలేజ్ ఏర్పాటు చేయాలని, మూతపడిన ఎస్సి హాస్టల్ భవనానికి మరమ్మతులు చేయించి వెంటనే పునఃప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం విద్యార్థుల కోసం అనేక రకాలుగా పోరాటాలకు పిలుపునిచ్చిందని తెలిపారు. అనంతరం 17 మందితో కూడిన ఎస్‌ఎఫ్‌ఐ మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా శివకుమార్, వంశిలు, ఉపాధ్యక్షులుగా వేణు, బషీర్, సి. హరితను, సహాయక కార్యదర్శులుగా విక్రమ్, అక్షయ, సుచిత్రలను ఎన్నుకున్నారు. సమావేశంలో ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు రవి కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

'నాడు- నేడు' నిర్లక్ష్యంతో.. నిరుపయోగంగా సిమెంట్ బస్తాలు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

గతేడాది జూన్‌లో నిర్వహించిన 'నాడు-నేడు' రెండో విడత పథకం కింద జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి వేలాది సిమెంట్ బస్తాలను పాఠశాలలకు పంపిణీ చేసింది. పనులు చేయడానికి గుర్తించిన పాఠశాలలకు నిధులు విడుదల చేసి అదనపు తరగతి గదుల నిర్మాణం, కిచెన్ షెడ్లు, టాయిలెట్స్, ప్రవాహరి నిర్మాణం వంటి పనులు చేయడానికి ఆయా స్కూళ్లకు సిమెంటు బస్తాలను పంపిణీ చేసింది. అవసరం ఉన్నా లేకపోయినా పాఠశాలలకు వేల సంఖ్యలో బస్తాలు చెప్పకుండా హడావిడిగా పంపిణీ చేసింది. రూ. 267 చొప్పున సిమెంటు బస్తాలను కొని ప్రభుత్వమే పంపిణీ చేసి, సాధ్యమైనంత వేగంగా నిర్మాణ పనులకు మొదలు పెట్టాలని శ్రీకారం చుట్టింది. అయితే ఇలా ప్రభుత్వం పాఠశాలకు పంపిణీ చేసిన సిమెంట్ బస్తాలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. సకాలంలో తరగతి గదుల నిర్మాణాలకు వినియోగించక పోవడంతో సిమెంట్ బస్తాలు గడ్డకట్టి నిరుపయోగంగా మారాయి. విలువైన ప్రజాధనం ఎందుకు పనికిరాకుండా పోయింది. ప్రస్తుతం చాలా స్కూళ్లలో సిమెంటు బస్తాలు, ఎలక్ట్రికల్ వస్తువులు, టాయిలెట్స్‌లలో ఉపయోగించే పింగాణి వస్తువులు అధిక సంఖ్యలో నిరుపయోగంగా ఉండిపోయాయి. లక్షల రూపాయల ప్రజాధనం వృథా అవుతోందని ప్రజలు వాపోతున్నారు.


ఓ ప్రభుత్వ పాఠశాలలో ఎందుకు పనికి రాకుండా గడ్డ కట్టేసిన సిమెంటు బస్తాలు, ఎలక్ట్రికల్ వస్తువులు

సుపరిపాలనపై టిడిపి ఇంటింటి ప్రచారం



ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

కోడుమూరు మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో టిడిపి నాయకులు మునిస్వామి సుపరిపాలనపై శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సిఎం నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, కర్నూలు కేడీసీసీ బ్యాంకు చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి సూచనల మేరకు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి ఆధ్వర్యంలో డోర్ టు డోర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఎస్. రామకృష్ణ, మాల కేశవరావు, కొప్పుల పరిసరాముడు పాల్గొన్నారు.

గడియారం ఆస్పత్రి తనిఖీ



ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూల్ పాతబస్తిలోని మున్సిపల్ కమిషనర్ పరిధిలో ఉన్న గడియారం ఆస్పత్రిని శుక్రవారం ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు తనిఖీ చేశారు. ఆస్పత్రి అభివృద్ధి, మ్యాన్ పవర్, వైద్య సిబ్బంది, వైద్య సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి అభివృద్ధి, రోగులకు వైద్య సేవలు అందించడానికి తన సహాయ, సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇన్‌ఛార్జీ సిఎస్ఆర్ఎమ్ఒ డాక్టర్ వెంకటరమణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్, గడియారం ఆస్పత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర అమర్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా : ప్రిన్సిపాల్

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కోడుమూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఎల్. ఆనంద్ రాజ్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. షేక్షావలి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీ యువకులు శనివారం ఉదయం 9 గంటలకు జాబ్ మేళాకు హాజరు కావాలని కోరారు. జాబ్ మేళాలో హాజరయ్యే నిరుద్యోగ యువతీ, యువకులు విద్యార్హతలు పదవ తరగతి, ఇంటర్, ఐ.టి.ఐ, ఏదైనా డిగ్రీ, పి.జి, చదివి 18-35ఏళ్లలోపు వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. ఈ జాబ్ మేళాలో సెలెక్ట్ అయిన అభ్యర్థులకి నెలకి రూ. 12 నుండి రూ. 21 వేల వరకు జీతం ఉంటుందని తెలిపారు. అభ్యర్థులు ఖచ్చితంగా విద్యార్హత పత్రాలు జిరాక్స్, ఆధార్ కార్డ్‌లతో అర్హత కలిగిన యువతి యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నెం. 8374376305ను సంప్రదించాలని తెలిపారు.

ఘనంగా అరుణమ్మ పుట్టిన రోజు వేడుకలు



ప్రజాశక్తి - కర్నూలు క్రైమ్

టిడిపి రాష్ట్ర కార్యదర్శి అరుణమ్మ పుట్టిన రోజు వేడుకలను కర్నూల్ నగరంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆమె పుట్టిన రోజు వేడుకల సందర్భంగా నగరంలోని మద్దూర్ నగర్ వృద్ధాశ్రమంలో పేదలకు అన్నదానం నిర్వహించారు. పేదల మధ్య ఆమె కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వృద్ధాశ్రమ నిర్వాహకులు ఆమెకు, ఆమె భర్త స్పెషల్ కలెక్టర్ మల్లికార్జునకు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవం

- ఎఐ ఆధారిత పురుష సంతానోత్పత్తి పరీక్ష ప్రారంభం

- తెలుగు రాష్ట్రాల్లోనే మొట్టమొదటిసారిగా ప్రత్యేక లెన్షూక్ ఎక్స్12 ప్రో ఆవిష్కరణ



ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

నగరంలోని ఫెర్టి9 ఫెర్టిలిటీ సెంటర్‌లో ప్రపంచ ఐవిఎఫ్ దినోత్సవాన్ని కేక్ కట్ చేసి శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం అత్యాధునిక ఎఐ ఆధారిత సెమెన్ ఎనలైజర్ లెన్షూక్ ఎక్స్12 ప్రోను పరిచయం చేస్తూ సంతానోత్పత్తి సంరక్షణ రంగంలో తన నూతన దిశను ప్రకటించి ఆవిష్కరించారు. ఫెర్టి9 ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ సుశ్రుత మాట్లాడుతూ ఈ సంస్థ ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని అన్ని కేంద్రాల్లో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమలు చేసిన తొలి ఐవిఎఫ్ చెయిన్‌గా నిలిచిందని తెలిపారు. ఇది కచ్చితమైన రోగనిర్ధారణ, సమగ్ర పునరుత్పత్తి సంరక్షణ పట్ల దాని నిబద్ధతను బలోపేతం చేస్తుందన్నారు. ఫెర్టి9 సహాయంతో గర్భధారణకు చేరుకొని విజయవంతంగా బిడ్డలను పొందిన జంటలు ఈ వేడుకలో పాల్గొని, తమ ప్రయాణాలను పంచుకుంటున్నారని చెప్పారు. ఈ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ద్వారా నిమిషాల వ్యవధిలోనే వేలాది వీర్యకణాలను విశ్లేషించగలుగుతామని తెలిపారు. డిఎన్ఎ సమగ్రతను కచ్చితంగా అంచనా వేసి, మరింత సమాచార ఆధారిత చికిత్స ఎంపికలు చేయడం సులభమవుతుందని చెప్పారు. దీని ద్వారా అధిక నాణ్యత గల వీర్యాన్ని గుర్తించడానికి, పిండం అభివృద్ధిని మెరుగు పరచడానికి, సంతానోత్పత్తి చికిత్సల విజయశాతం పెంచడానికి గణనీయమైన తోడ్పాటుగా లభిస్తుందని వివరించారు. ఈ విప్లవాత్మక ప్లాట్‌ఫామ్ కేవలం ఆరు నిమిషాల్లో ప్రతి నమూనాలో 3 వేల వీర్య కణాలను విశ్లేషించగలదని తెలిపారు. గణన, చలనశీలత, ఆకృతి, డిఎన్ఎ సమగ్రతపై కచ్చితమైన వివరాలు అందిస్తుందన్నారు. ఫెర్టి9 ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ ఇది ఐవిఎఫ్ వైఫల్యాలను తగ్గించడంలో, గర్భధారణ విజయాన్ని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సంతానోత్పత్తి సమస్యలలో మగవారి వంతు సగానికి కాగా, తొలి సంప్రదింపులలో 95 శాతం వరకు మహిళలచే ప్రారంభమవుతున్నాయని అన్నారు. తాము ప్రవేశపెట్టిన అత్యాధునిక రోగనిర్ధారణ వ్యవస్థతో, సంతానోత్పత్తి సంరక్షణను మరింత సమగ్రంగా, డేటా ఆధారితంగా పునర్నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. టు గెదర్ ఇన్ ఐవిఎఫ్ ప్రచారంలో భాగంగా ఫెర్టి9 జంటలకు ప్రత్యేక సంతానోత్పత్తి అంచనా ప్యాకేజీని కేవలం రూ.599 వద్ద అందిస్తోందన్నారు. ఇందులో సంతానోత్పత్తి సూపర్ స్పెషలిస్ట్‌తో సంప్రదింపులు, అల్ట్రాసౌండ్, ఎఎంహెచ్ టెస్ట్, వీర్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఈ నెల 31 నాటికీ చికిత్స ప్రారంభించగల జంటలకు, ఐయుఐ చికిత్సపై 50 శాతం, ఐవిఎఫ్‌పై 25 శాతం రాయితీ కూడా లభిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేనేజర్ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలుగా మార్చాలి

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

పేదరికంలో ఉన్న వారిని పి4 విధానం కింద దత్తత తీసుకొని బంగారు కుటుంబాలుగా మార్చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. శుక్రవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచివాలయం నుంచి పి4 విధానం అమలుపై కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్లో నుంచి జెసి బి.నవ్య, సిపిఒ పాల్గొని జిల్లాలో చేపట్టిన పి4 విధానం అమలు తీరుపై వివరించారు.

పరిశుభ్రతలో ప్రజా భాగస్వామ్యం పెరగాలి

- మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

పరిసరాల పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.గంగిరెడ్డి తెలిపారు. శుక్రవారం పట్టణంలోని రాఘవేంద్ర కాలనీ, గుడికల్ రోడ్డు, ఎస్ఎంటి కాలనీ, పలు ప్రాంతాల్లో పర్యటించారు. ప్రజలకు పారిశుధ్య నిర్వహణ గురించి, తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఓపెన్ సైట్లు ఉన్న యజమానులు, సంబంధిత సైట్‌లో పారిశుధ్య లోపం లేకుండా శుభ్రంగా ఉంచుకోవాలని, లేకపోతే పబ్లిక్ హెల్త్ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, సిఎంఎం జయవర్ధన్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ మార్గం ద్వారా నీటి సరఫరా



ప్రజాశక్తి - కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరపాలక సంస్థ నగర ప్రజలకు తాగునీటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేస్తోంది. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ పి.విశ్వనాథ్ శుక్రవారం తెలిపారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన,,

తాగునీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులను సేకరించేందుకు నగరపాలక కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు పరిశీలించారు.

పార్టీ అభివృద్ధికి కృషి చేస్తాం

- నూతన మండలాధ్యక్షులు గోపాల్

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని బిజెపి మండల అధ్యక్షులు గోపాల్ తెలిపారు. శుక్రవారం చిప్పగిరిలో మండల మాజీ అధ్యక్షులు పరంధామయ్య, బిజెపి సీనియర్ నాయకులు తిమ్మప్ప ఆధ్వర్యంలో గోపాల్‌ను పూలమాల, శాలువాతో సన్మానించారు. నారాయణ స్వామి, రంగస్వామి, రంగనాయకులు, బైసాని కృష్ణమూర్తి, సాగర్, రమేష్ పాల్గొన్నారు.


గోపాల్‌ను సన్మానిస్తున్న నాయకులు

ఉచితంగా ఫార్మర్ డాట్ చార్ట్ సేవలు

- నాబార్డు ఎజిఎం రామసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - పత్తికొండ

డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ వారు ఎఐ టెక్నాలజీతో రైతులకు ఉచితంగా ఫార్మర్ డాట్ చార్ట్ యాప్‌ను రూపొందించారని నాబార్డ్ ఎజిఎం రామ సుబ్బారెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని హోసూరు గ్రామ సచివాలయంలో డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ మైక్రోసాఫ్ట్ భాగస్వామ్యంతో జిల్లా ఉద్యాన శాఖ సౌజన్యంతో డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ అధికారి రేణుకా రెడ్డి అధ్యక్షతన ఫార్మర్ చాట్ మొబైల్ ఆఫ్ సేవలపై రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా ఎజిఎం రామసుబ్బారెడ్డి, ఉద్యాన శాఖ అధికారి రామాంజనేయులు, బనవాసి కెవికె ప్రోగ్రాం కో ఆర్డినేటర్ రాఘవేంద్ర చౌదరి, రిలయన్స్ ఫౌండేషన్ డిపిఎం కుమారస్వామి రెడ్డి పాల్గొని మాట్లాడారు. రైతుకు నిత్యం తోడ్పాటు అందించడానికి ఉచితంగా ఎఐ టెక్నాలజీతో ఫార్మర్ డాట్ చాట్ మొబైల్ ఆఫ్ సేవలందిస్తున్నామని తెలిపారు. మూడు రోజుల వాతావరణం, పైరు వివిధ దశల్లో సమగ్ర సస్యరక్షణ సలహాలు, సూచనలు, పంట ఉత్పత్తుల ధరల సమాచారం రైతులకు ఉపయోగపడతాయని చెప్పారు. నవయూత్ అసోసియేషన్ సిఇఒ నరసింహులు, హెచ్ఇఒ సునీల్ కుమార్, ఎఇఒ రియాజ్, శ్రీనాథ్, ఆర్డిప్ అపార్ట్ సంస్థల రైతు ఉత్పత్తిదారుల సంఘాల ప్రతినిధి బనగాని శ్రీనివాసులు, రైతులు పాల్గొన్నారు.



సొసైటీ మండల అధ్యక్షులుగా చిన్న తిమ్మప్ప



ప్రజాశక్తి - సిబెళగల్

సొసైటీ మండల అధ్యక్షులుగా పోలకల్‌కు చెందిన టిడిపి నాయకులు బిఎస్.చిన్న తిమ్మప్ప ఎన్నికయ్యారు. శుక్రవారం సొసైటీ కార్యాలయంలో సిఇఒలు రవికుమార్ రెడ్డి, ఖాజా, లక్ష్మన్న, డైరెక్టర్లు ముడుమాల పౌలు, గుండ్రేవుల సయ్యద్ బాబు, సిబ్బంది సమక్షంలో ఆశీనులయ్యారు. మొదటి సంతకం చేస్తూ మాట్లాడారు. టిడిపి మండల కన్వీనర్‌గా మండల ముఖ్య నాయకులుగా, కొండాపురం నీటి సంఘం అధ్యక్షునిగా ప్రస్తుతం సొసైటీ మండల అధ్యక్షుల స్థాయి వరకు రాణించామంటే డి.విష్ణువర్ధన్, కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి సారథ్యంలోనేనని తెలిపారు. అనంతరం పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు సన్మానంతో స్వాగతం పలికారు.

వీధిలైట్లు వెలిగించండి : సిపిఎం

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

పేదలు నివసించే శరీన్ నగర్‌లో వెంటనే వీధిలైట్లు వెలిగించాలని సిపిఎం నగర నాయకులు యేసురాజు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ 30వ వార్డు పరిధి శరీన్ నగర్‌లో 3 వారాల నుండి లైట్లు వెలగక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. మున్సిపల్ అధికారులు త్వరగా స్పందించి లైట్లు వేయాలన్నారు. సెంటర్ తో పాటు అంబేద్కర్ జ్యోతిరావ్ పూలే విగ్రహం నుండి రాజశేఖర్ రెడ్డి విగ్రహం వరకు, అలాగే స్నేహ చికెన్ సెంటర్ వరకు లైట్లు వెలగడం లేదన్నారు. కమిషనర్ వెంటనే స్పందించి వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు.